క్లుప్తంగా

స్వామిత్వ సర్వే వేగవంతం చేయాలి



సీతానగరంలో స్వామిత్వ సర్వేపై సమీక్షిస్తున్న డీడీఓ వీణాదేవి

సీతానగరం: మండల గ్రామాల్లో స్వామిత్వ సర్వే సత్వరమే పూర్తి చేయాలని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి, జీఎస్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జ్ అధికారి పి.వీణాదేవి సూచించారు. శనివారం మండలంలోని ముగ్గళ్ల, మునికూడలి, రఘుదేవపురం పంచాయతీల్లో స్వామిత్వ సర్వేను డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి వీణాదేవి, డీఎల్‌పీవో ఎమ్.నాగలత పరిశీలించి, ఆయా పంచాయతీల్లో రికార్డులను పరిశీలించారు. సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎమ్ భారతితో స్వామిత్వ సర్వే ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి టి.శ్రీనివాస్ పాల్గొన్నారు

గ్రామాల్లో ఫీవర్ సర్వే

సీతానగరం: పలు గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నామని సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఏవీకే చైతన్య శనివారం తెలిపారు. చినకొండేపూడి, పెదకొండేపూడి, నాగంపల్లి, చీపురుపల్లి, సీతానగరం తదితర గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది నిర్వహిస్తున్నారు. జ్వర బాధితులకు ఉచితంగా మందులు అందిస్తున్నారు. సూపర్‌వైజర్ కె.సుధాకర్, ఎమ్‌పీహెచ్‌ఎలు ఎస్‌వీఆర్ కిషోర్, ఎస్ వెంకటరావు, ఏఎన్‌ఎమ్‌లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధికి త్రిమూర్తులు విశేష కృషి

రంగంపేట: అంకిత భావంతో, చిత్తశుద్ధితో సంఘ అభివృద్ధికి విశేష కృషి చేసిన త్రిమూర్తులు యువ ఉద్యోగులకు ఆదర్శనీయుడని డీసీసీబీ బ్రాంచి మేనేజర్ బషీర్ అన్నారు. శనివారం స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ముఖ్య కార్యనిర్వహణాధికారి బొడ్డు త్రిమూర్తులు ఉద్యోగ విరమణ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు గారపాటి రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన సత్కార సభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సంఘ అభివృద్ధికి త్రిమూర్తులు చేసిన కృషిని డీసీఎంఎస్ మాజీ వైస్ చైర్మన్ పోతుల వెంకటరాజు, సంఘ సభ్యులు దుబాసి వర ప్రసాద్, బోడెం రాంబాబు వివరించారు. ఇన్‌చార్జి సీఈఓ గా కాకర్ల రామకృష్ణకు బాధ్యతలు అప్పగించారు. అనంతరం త్రిమూర్తులు మాళవిక దంపతులను ఘనంగా సత్కరించారు. డీసీసీబీ బ్యాంకు ఉద్యోగులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎంపీ జమునకు ఘన నివాళి

రంగంపేట: రాజమహేంద్రవరం మాజీ ఎంపీ, సినీనటి దివంగత కోటిపల్లి గోదావరి గౌరి (జమున) 90వ జయంతిని దొడ్డిగుంట గ్రామంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సినీ విశ్లేషకుడు అడబాల మరిడయ్యకాపు ముందుగా జమున చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో ఆమెకు విడదీయరాని బంధం ఉందన్నారు. ఆమె నటించిన అనేక సినిమాలు గోదావరి జిల్లాల్లోనే చిత్రీకరించారని అన్నారు. సినీ, నాటక రంగ కళాకారులకు ఆమె సహాయ సహకారాలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక గణపతి ఆలయ కమిటీ చైర్మన్ వెలమర్తి వెంకటేశ్వరరావు, పేపకాయల వెంకన్న, మల్లెల సత్యనారాయణ, చంద్రమళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి

రాజానగరం: చదువుతోపాటు చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని రాజమహేంద్రవరానికి చెందిన ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్. రెడ్డిప్రసన్న సూచించారు. దివాన్‌చెరువు, జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వివిధ చట్టాలను వివరించారు. కార్యక్రమంలో పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేకరించిన భూమికి పరిహారం అందిస్తాం

రాజానగరం: దివాన్‌చెరువులో ఫ్లైఓవర్ నిర్మాణం కోసం సేకరించిన భూమికి పూర్తి స్థాయిలో పరిహారం చెల్లిస్తామని రాజమహేంద్రవరం ఆర్డీఓ ఆర్.కృష్ణనాయక్ తెలిపారు. భూసేకరణపై కొంతమంది అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో శనివారం ఇక్కడికి వచ్చిన ఆయన క్షేత్రస్థాయిలో పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. సేకరించిన స్థలాలకు సంబంధించిన యజమానులతో మాట్లాడారు. ఎవరికీ నష్టం జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ

బిక్కవోలు: బలభద్రపురంలో రేషన్ స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో గ్రామానికి చెందిన 3,250 కార్డులను లబ్ధిదారులకు అందించారు. సర్పంచి బుంగా రామారావు, సొసైటీ అధ్యక్షుడు నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూరియా నో స్టాక్ !

- రైతుకు ఒక్క బస్తా మాత్రమే
- ప్రైవేట్ వ్యాపారుల వద్ద బస్తా ధర రూ.370
- అన్నదాతకు తప్పని కష్టాలు
- పట్టించుకోని కూటమి ప్రజాప్రతినిధులు

సీతానగరం: కూటమి ప్రభుత్వంలో అన్నదాతకు కష్టాలు తప్పడం లేదు. సాగుదారులకు రైతు భరోసా వంటి పథకాలూ అందలేదు. ఆర్బీకేల్లో విత్తనం నుంచి యూరియా వరకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు సకాలంలో అందేవి. ప్రస్తుతం ఆ పరిస్థితుల్లేవు. చివరకు యూరియా కూడా లేదని తెలుపుతూ సహకార సంఘాల వద్ద నో స్టాక్ బోర్డులు వెలుస్తున్నాయి. దీంతో ప్రైవేట్ వ్యాపారులు యూరియాను అధిక ధరలకు విక్రయిస్తూ అన్నదాతను దోచుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయ రంగం కుదేలవుతోంది. రైతులకు రాయితీలు ఇవ్వకపోగా పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కూడా లభించడం లేదు. వ్యాపారులు, దళారులు అడిగిన ధరలకు పంట ఉత్పత్తులను విక్రయించి రైతులు నష్టాల పాలవుతున్నారు. మరో వైపు అన్నదాతకు యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలమైంది. సొసైటీల్లోనూ యూరియా లేకపోవడంతో ఇదే అదునుగా ప్రైవేట్ వ్యాపారులు రైతులను దోచుకుంటున్నారు. యూరియాతోపాటు ఎరువుల బస్తాలు తీసుకోవాలని ఆంక్షలు పెడుతున్నారు.

42 వేల ఎకరాల్లో వరి సాగు

రాజానగరం నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌లో వరి పంట 42 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. సాగుదారులకు యూరియా అందించేందుకు ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. సొసైటీలకు తక్కువ యూరియా సరఫరా చేయడంతో రైతులు పలు ఇబ్బందులు పడుతున్నారు. సీతానగరం మండలంలో సుమారు 16 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. పీఏసీఎస్‌లు 14, ప్రైవేట్ డీలర్లు 7, కోరుకొండ మండలంలో 5 పీఏసీఎస్‌లు, ప్రైవేట్ డీలర్లు 12, రాజానగరం మండలంలో ఒక పీఏసీఎస్, రైతు సేవా కేంద్రాలు 13, ప్రైవేట్ డీలర్లు 12 ద్వారా ఇప్పటికి యూరియా రైతులకు అందిస్తున్నారు. రాజానగరం మండలంలో 850 మెట్రిక్ టన్నులు, సీతానగరం మండలంలో 2,090 మెట్రిక్ టన్నులు, కోరుకొండ మండలంలో 1,250 మెట్రిక్ టన్నులు యూరియా అందించామని ఆయా మండల వ్యవసాయశాఖాధికారులు అంటున్నారు. రైతులకు యూరియా కొరత ఎందుకు ఏర్పడిందో కూటమి ప్రభుత్వానికే ఎరుక.

యూరియా ఎదురుచూపు

పీఏసీఎస్‌ల చుట్టూ రైతులు ఎన్నిసార్లు తిరిగినా యూరియా లభ్యం కావడం లేదు. మండలాల్లో ఉన్న సొసైటీలు, రైతు సేవా కేంద్రాలు, ప్రైవేట్ డీలర్ల ద్వారా యూరియా అందిస్తున్నారు. రైతు సేవా కేంద్రాల వద్ద, పీఏసీఎస్‌ల వద్ద ఒక్క బస్తా కూడా స్టాక్ లేకపోవడంతో రైతులు వెనుతిరుగుతున్నారు. వారానికి పది టన్నులు (220 బస్తాలు) సొసైటీలకు వస్తుండగా అక్కడకు వందలాది మంది రైతులు చేరుకుంటే కేవలం ఒక్క బస్తా మాత్రమే అందించి చేతులు దులుపుకుంటున్నారు. మిగిలిన రైతులు ఖాళీ చేతులతో వెనుతిరుగుతున్నారు.



సీతానగరం పీఏసీఎస్ వద్ద యూరియా కోసం రైతులు (ఫైల్ ఫోటో)

ప్రైవేట్ వ్యాపారులు వద్ద అధిక ధరలు

నియోజకవర్గంలో ప్రైవేట్ వ్యాపారుల వద్ద యూరియాను అధిక ధరలకు అత్యంత గోప్యంగా అమ్మకాలు జరుపుతున్నారు. పీఏసీఎస్‌ల వద్ద బస్తా యూరియా రూ.266.50 రైతులు కొనుగోలు చేస్తున్నారు. ప్రైవేట్ వ్యాపారుల వద్ద యూరియా బస్తా రూ.350 నుంచి రూ.370 వరకు విక్రయిస్తున్నారు. ఒక్క యూరియా బస్తాతోపాటుగా గుళికలు లేదా ఎరువుల బస్తా, లేదా పురుగుల మందు తీసుకోవలసిందే, లేకుంటే యూరియా ఇవ్వడం లేదు. దీనితో రైతులకు అధిక భారం అవుతోంది. అధిక ధరలను, ప్రైవేట్ వ్యాపారుల ఆగడాలను నియంత్రించాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చాలా ఇబ్బందులు పడుతున్నాం



యూరియా లభించక చాలా ఇబ్బందులు పడుతున్నాం. రైతు భరోసా కేంద్రాల్లోనూ యూరియా ఉండటం లేదు. పీఏసీఎస్‌ల వద్ద మాత్రమే యూరియా వారానికి ఒక రోజు విక్రయిస్తున్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా ఎందుకు అందించడం లేదో తెలియడం లేదు.

– కోనే శ్రీనివాసరావు (ఇంద్ర), రైతు, చినకొండేపూడి

ప్రభుత్వ సేవల్లో తీవ్ర జాప్యం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పుష్కలంగా ఎరువులు, యూరియా ఆర్బీకే వద్ద లభించేవి. ఇప్పుడు స్టాక్ లేదని వెనక్కి పంపిస్తున్నారు. యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు అందుతున్న సేవల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది.

– వలవల వెంకట్రాజు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి, సీతానగరం

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం



యూరియా ప్రైవేట్ వ్యాపారులు అధిక ధరలకు అమ్ముతున్నట్లు మా దృష్టికి రాలేదు. ఎవరైనా రైతులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం. యూరియా స్టాక్ త్వరలో అందుబాటులోకి వస్తుంది. పీఏసీఎస్‌లు, ప్రైవేట్ డీలర్లు, రైతు సేవా కేంద్రాల వద్ద యూరియా ఉంచుతాం.

– జయ రామలక్ష్మి, కోరుకొండ, ఏడీఏ

యూరియా కొరతపై రైతుల ఆందోళన



వడిశలేరు సొసైటీ వద్ద యూరియా కోసం ఆందోళన చేస్తున్న రైతులు

రంగంపేట: ప్రభుత్వం సరఫరా చేస్తున్న యూరియా రైతుల డిమాండ్‌కు సరిపోవడం లేదు. ఒకలోడు, అరలోడు చొప్పున యూరియా వస్తుంటే కేవలం గంటల వ్యవధిలోనే ఖాళీ అవుతోంది. మండలంలో ఈ ఏడాది మొక్కజొన్న, వరి సాగు చేపట్టారు. ఈ పంటలకు యూరియా అవసరం అధికం. ప్రభుత్వం అరకొరగా సరఫరా చేస్తుండటంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. యూరియా కోసం రైతు సేవా కేంద్రాలు, సొసైటీల వద్ద తెల్లవారుజాము నుంచే రైతులు క్యూ కడుతున్నారు. శుక్ర, శనివారాల్లో వడిశలేరు సొసైటీకి 42 మెట్రిక్ టన్నుల యూరియా రాగా, గంటల వ్యవధిలోనే ఖాళీ అయిపోయింది. చాలా మంది రైతులు నిరుత్సాహంతో వెనుదిరిగారు. మండలంలో 1,200 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటి వరకు 600 మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే వచ్చింది. సొసైటీ సిబ్బందితో కొందరు కుమ్మక్కై ఆటోల్లో యూరియా తరలించుకుపోతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



రఘుదేవపురం శ్రీవిజయ గణపతి మండపంలో సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

సీతానగరం: రఘుదేవపురంలో శ్రీవిజయ గణపతి ఉత్సవ కమిటీ పర్యవేక్షణలో సామూహిక సత్యనారాయణ స్వామివారి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. శనివారం రఘుదేవపురం రామాలయం ఎదురుగా వీధిలోని మండపంలో శ్రీవిజయ గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పలపాల లోవరాజు, దుర్గ దంపతుల ఆధ్వర్యంలో 25 మంది దంపతులకు అర్చకులు కేశవ సామూహిక శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. దంపతులకు తాంబూలంతోపాటు కండువా, పసుపు, కుంకుమ, జాకెట్ ముక్కలు, శ్రీస్వామివారి తీర్థప్రసాదాలు అందించారు.

అలరించిన కోలాట నృత్య ప్రదర్శన



బలభద్రపురంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో కోలాటం ప్రదర్శన

బిక్కవోలు: బలభద్రపురం శ్రీదేవి,భూదేవి సహిత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం గ్రామానికి చెందిన మహిళలు,బాలికలు కోలాటం నృత్య ప్రదర్శనతో భక్తులను అలరించారు.శనివారం ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. 35 మంది కోలాట కళాకారులు, శ్రీ కల్యాణ వేంకటేశ్వర భజన మండలి ఆధ్వర్యంలో కోలాట నృత్య ప్రదర్శన నిర్వహించారు. భజన మండలి అధ్యక్షురాలు కొవ్వూరి సత్యవతి సంప్రదాయక కళలను ఎంతో మంది ఆదరిస్తున్నారని తెలిపారు. ఆలయం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఆలయం కమిటీ సభ్యులు పడాల రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకం

పెదపూడి: సంపర గ్రామంలో ప్రాచీన ప్రసిద్ధి చెందిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు స్వామి వారికి పంచామృతాభిషేకం, తులసి పూజ, అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

గ్రేడింగ్ విధానంపై ప్రత్యేక దృష్టి

బిక్కవోలు: గ్రేడింగ్ విధానంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో సత్యనారాయణ అన్నారు. శనివారం బలభద్రపురం ఉన్నత పాఠశాల వద్ద హెచ్‌ఎం పి.ప్రభాకర్ అధ్యక్షత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగస్టుకు సంబంధించిన ఫార్మేటివ్ అసెస్మెంట్ గ్రేడింగ్ విధానంపై ఆయన సమీక్షించారు. సబెక్టుల వారీగా విద్యా శాఖ రూపొందించిన వెబ్ లింకుల ద్వారా శిక్షణ తరగతులు కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్లు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రతి నెల ఉపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ ద్వారా నిర్వహించే సమీక్ష సమావేశాల వల్ల విద్యా విధానంలో నూతన పోకడలకు గుణాత్మకమైన మార్పులను తెలియజేసి బోధనలో విద్యార్థులు స్థాయిని మెరుగుపరచడానికి ఎంతోగానో ఉపయోగపడతాయని అన్నారు. ప్రధానోపాధ్యాయులు చిర్ల శ్రీనివాసరెడ్డి, గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బలభద్రపురంలో మాట్లాడుతున్న ఎంఈవో సత్యనారాయణ

అక్రమాలను ప్రశ్నించినందుకే తప్పుడు ఆరోపణలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి : ప్రజాపోరాటంలో భాగంగా తాను సంధిస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తన కుమారుడు, కోడలు ఫొటోలను మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం అనపర్తి పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న అడ్డగోలు వ్యవహారాలు, అవినీతి, అక్రమాలపై ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పవలసిన ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తన స్థాయిని దిగజార్చుకుని క్రికెట్ బుకీలతో సామాజిక మాధ్యమాలలో నీచంగా మాటలాడిస్తున్నారన్నారు. తన కుమారుడు డాక్టర్ గౌతమ్‌రెడ్డి దంపతులు ఎనిమిదేళ్ల క్రితం నిర్వహించిన జన్మదిన వేడుకల్లో హాస్యభరితమైన స్కిట్‌లో నటించిన పాత ఫొటోను మార్ఫింగ్ చేయించి సోషల్ మీడియాలో పెట్టి అడ్డమైన ఆరోపణలు చేస్తూ రామకృష్ణారెడ్డి నీచ రాజకీయాలు చేస్తున్నారని డాక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ గౌతమ్‌రెడ్డి ఎదుగుదలను చూసి ఓర్వలేని ఎమ్మెల్యే తప్పుడు ఆరోపణలు ప్రచారం చేస్తున్నారని డాక్టర్ అన్నారు. గౌతమ్‌రెడ్డి మంగళగిరి ఎన్నారై కళాశాలలో మొదటి స్థానంలో, చెన్నై రామచంద్రా యూనివర్సిటీలో ఎంసీహెచ్ యూరాలజీ విభాగంలో మొదటి స్థానంలో నిలిచినందుకు ఎంతో గర్విస్తున్నామన్నారు. రామకృష్ణారెడ్డి మాత్రం అన్నిరంగాల్లో చతికిల పడిన తన కుమారుడిని రాజకీయాల్లోకి తీసుకువచ్చి ప్రజలపై రుద్దడానికి నానా హైరానా పడుతున్నారని ఎద్దేవా చేశారు. బ్యాంకు నుంచి డాక్టర్ గౌతమ్, తాను కలసి రుణం తీసుకుని అన్ని సౌకర్యాలతో ఆస్పత్రి నిర్మించామని డాక్టర్ వివరించారు. రామకృష్ణారెడ్డి ఎన్ని తప్పుడు ఆరోపణలు చేసినా చేయించినా వెనక్కి తగ్గేది లేదని తప్పులను నిత్యం ఎండగడుతూనే ఉంటానని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి హెచ్చరించారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో విద్యార్థినులకు పరుగుల పందెం నిర్వహిస్తున్న అధ్యాపకులు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో క్రీడా విభాగం సమన్వయకర్త, రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బి.మాధవ్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ డి చిట్టిబాబు, అధ్యాపకులు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూల వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు డాక్టర్ మాధవ్ మాట్లాడుతూ భారత హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినోత్సవాన్ని జాతీయ క్రీడా దినోత్సవంగా నిర్వహిస్తారని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు, కామర్స్ అధ్యాపకులు షేక్ దుర్గ మదీనా క్రీడల ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ నాగేశ్వరరావు, సుబ్బారావు, మీనాక్షి, వాణి, అలేఖ్య, వెంకటేష్, ఫణీంద్ర కుమార్, డాక్టర్ సుధామయి పాల్గొన్నారు.

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి



సింగంపల్లి వైద్య శిబిరంలో మందులు అందిస్తున్న వైద్య సిబ్బంది

రంగంపేట: వ్యాధుల నివారణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సీహెచ్ వేణుశ్రీలక్ష్మి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల్లో సీజనల్ వ్యాధి బాధితుల గుర్తింపు, నివారణ కార్యక్రమాలు చేపట్టామన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, తాగునీరు శుభ్రత, దోమల నియంత్రణ, ఆహార పదార్థాల పరిశుభ్రతపై సూచనలు అందిస్తున్నామన్నారు. సింగంపల్లి పీహెచ్‌సీలోని అన్ని గ్రామాల్లో డాక్టర్ సంకీర్తన ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన, నివారణ చర్యలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఎంపీహెచ్‌ఏలు, ఏఎన్‌ఎంలు, ఎమ్‌ఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొంటున్నారని తెలిపారు.

బాల గణపతి ఆలయంలో హోమం



పందలపాకలో గణపతి హోమంలో పాల్గొన్న భక్తులు



బిక్కవోలు శ్రీ లక్ష్మీ గణపతి స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

బిక్కవోలు: మండలంలోని పందలపాక దేవాంగుల వీధిలో కొలువైన శ్రీ బాల గణపతి ఆలయం వద్ద శనివారం ఘనంగా గణపతి హోమం నిర్వహించారు. గణపతి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన బాల గణపతి మండపంలో సుమారు 40 జంటలలో గణపతి పూజ, అభిషేకాలు, హోమం అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

శ్రీ లక్ష్మీ గణపతి భారీగా భక్తులు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు కొలువైన శ్రీ లక్ష్మీ గణపతిని దర్శించుకునేందుకు ఆలయానికి శనివారం భక్తుల భారీగా తరలివచ్చారు గణపతి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయంలో రద్దీ నెలకొంది. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దాతల సహకారంతో భక్తులకు అన్నసమారధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలోని ఆలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించాలి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లాస్థాయిలో సెప్టెంబర్ 13న నిర్వహించనున్న లోక్ అదాలత్‌తో అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. జిల్లా కోర్టు చాంబర్‌లో రాజమహేంద్రవరంలోని న్యాయవాదులతో గంధం సునీత శనివారం సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, క్రిమినల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులను అధిక సంఖ్యలో పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తితోపాటు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, ఎన్.శ్రీలక్ష్మి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని విధులు నిర్వహిస్తున్న న్యాయమూర్తులందరితో సమావేశం నిర్వహించారు.

తహసీల్దార్ ఫిర్యాదుతో కేసు నమోదు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం తహసీల్దార్ శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోర్టు అనుమతితో ఉండేశ్వరపురానికి చెందిన వేమగిరి నరసయ్యపై కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్‌కుమార్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ 2020లో కుటుంబ సభ్యుల ధ్రువీకరణపత్రం కోసం నరసయ్య తప్పుడు సమాచారం ఇచ్చి సర్టిఫికెట్ తీసుకోగా, సర్టిఫికెట్ ఇచ్చిన తహసీల్దార్ మరణించారు. నరసయ్య ఇద్దరు చెల్లెళ్లు ఉందుర్తి పరంజ్యోతి, కొక్కిరపాటి సుబ్బాయమ్మ మరణించారు. కుటుంబ సభ్యులు ఎవరూ లేరని, తానొక్కడినే సంతానమని నరసయ్య నమ్మించి సర్టిఫికెట్ పొందాడు. మరణించిన చెల్లెలు కుటుంబ సభ్యులు లోకాయుక్తలో ఫిర్యాదు చేయగా, విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోర్టు తహసీల్దార్‌ను ఆదేశించింది. నరసయ్య తప్పుడు సమాచారం ఇచ్చినట్లు విచారణలో గుర్తించి తహసీల్దార్ శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోర్టు అనుమతితో కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఏఎంసీ యార్డు అసిస్టెంట్‌కు ఘన సత్కారం

అనపర్తి : అనపర్తి మార్కెట్ కమిటీలో 24 ఏళ్లపాటు యార్డు అసిస్టెంట్‌గా విశేష సేవలందించిన చాగంటి కాటమరాజు సేవలు అభినందనీయమని అనపర్తి పీఏసీఎస్ చైర్మన్ కొవ్వూరి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అనపర్తి మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన చాగంటి కాటంరాజు పదవీ విరమణ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాటమరాజు సేవలను కొనియాడారు. అనంతరం కాటంరాజును ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురుకు కూటమి నాయకులు మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలి

పెదపూడి: పాఠశాలల్లో విద్యార్థులకు విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపర్చడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో-2 సీవీవీ సత్యనారాయణ అన్నారు. పెదపూడిలోని మెయిన్ ప్రాథమిక పాఠశాలలో కాంప్లెక్స్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బొమ్మూరులోని డైట్ కాలేజి నుంచి అబ్జర్వర్ షేక్ జిలాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక బాధ్యతతో ఉపాధ్యాయుల బోధన సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-1 కె.సత్యనారాయణ, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థి కనీస అభ్యసన స్థాయిపై దృష్టి సారించాలి

కంబాలచెరువు: విద్యార్థి కనీస అభ్యసన స్థాయిల సాధనకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని డైట్ లెక్చరర్, క్లస్టర్ కాంప్లెక్స్ లైజనింగ్ ఆఫీసర్ కె.దుర్గబాబు అన్నారు. స్థానిక బైపాస్‌రోడ్డులోని డీఎమ్‌హెచ్ క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలను అయన శనివారం పరిశీలించారు. ఉపాధ్యాయుల నుద్దేశించి దుర్గబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థుల హాజరు శాతం పెరిగేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. డీఎమ్‌హెచ్ క్లస్టర్ కాంప్లెక్స్ సెక్రటరీ పరస జగన్నాథరావు, సీఆర్‌యంటీ జయంతి శాస్త్రి, క్లస్టర్‌లోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.